

పట్టపగలే దోచేశారు

సింగరాయకొండ మండలం మూలగుంటపాడు పంచాయతీ విద్యానగర్‌లో పట్టపగలే భారీ చోరీ జరిగింది. 36 సవర్ల బంగారం, అరకేజీ వెండి చోరీ చేశారు. - 8లో..



ప్రజలకు చేరువగా రెవెన్యూ సేవలు

ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత దగ్గర కానున్నాయని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. మార్కాపురంలో ఆధునికీకరించిన సబ్‌కలెక్టర్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
42 /31

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షంపడే అవకాశం ఉంది. ఉక్కపోత అధికం.

న్యూస్‌రీల్

108లో డ్రైవర్ల నియామకం ఈ నెల 14న

ఒంగోలు అర్బన్: అత్యవసర సమయంలో ఆదుకునే 108 వాహనంలో డ్రైవర్లను నియమించేందుకు ఈ నెల 14వ తేదీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు 108 మేనేజర్ విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం, బాపట్ల జిల్లాలకు సంబంధించి 35 ఏళ్ల లోపు వయసు కలిగిన అర్హత కలిగిన డ్రైవర్లు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు పదో తరగతి సర్టిఫికెట్, ఇతర ధ్రువపత్రాలు తీసుకుని ఒంగోలులోని 108 కార్యాలయానికి రావాలని పేర్కొన్నారు.

జిల్లాకు 21 మంది తహశీల్దార్ల కేటాయింపు

ఒంగోలు అర్బన్: జిల్లాకు కొత్తగా 21 మంది తహశీల్దార్లను కేటాయిస్తూ సీసీఎల్‌ఏ ఉత్తర్వులు జారీ చేసింది. జోన్–3 (గుంటూరు, ప్రకాశం, నెల్లూరు)లో డిప్యూటీ తహశీల్దార్లుగా ఉంటూ అడహక్ తహశీల్దార్‌లుగా పనిచేస్తున్న 54 మందికి తహశీల్దార్లుగా పదోన్నతి కల్పించి రెగ్యులర్ తహశీల్దార్లుగా ప్రకటిస్తూ సీసీఎల్‌ఏ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. తహశీల్దార్లుగా నియమితులైన 54 మందిలో 21 మందిని ప్రకాశం జిల్లాకు కేటాయించారు.

జగనన్న పాల వెల్లువతో పాడి రైతులకు మేలు

● జిల్లా పశుసంవర్ధక సంయుక్త సంచాలకులు బేబిరాణి



తలమళ్లలో మహిళలతో మాట్లాడుతున్న బేబిరాణి

పొదిలి రూరల్: జగనన్న పాల వెల్లువతో పాడి రైతులకు అన్ని విధాలా మేలు జరుగుతుందని జిల్లా పశు సంవర్ధక సంయుక్త సంచాలకులు డాక్టరు కే బేబిరాణి అన్నారు. సోమవారం పొదిలి మండలంలోని తలమళ్ల అమూల్ మిల్క్ కలెక్షన్ సెంటరును (ఏఎంసీయూ) ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పాల కేంద్రాలకన్నా అమూల్ పాల కేంద్రంలో లీటరుకు గేదె పాలపై దాదాపు రూ.5, ఆవు పాలపై రూ.3 ఎక్కువ రేటు ఇస్తుందన్నారు. దళారీలకు తావు లేకుండా రైతుల నుంచి పలు సేకరించడమే కాకుండా పది రోజుల్లో నేరుగా వారి ఖాతాలో డబ్బులు జమ చేస్తారన్నారు. అధికారులు, గ్రామస్తులు రైతులకు అవగాహన కల్పించి ప్రభుత్వ డెయిరీకి పాల వచ్చేలా కృషి చేయాలన్నారు. ఆమె వెంట పశుసంవర్ధక సహాయకులు ఉన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత

● అవగాహన ర్యాలీ ప్రారంభించిన కలెక్టర్ దినేష్‌కుమార్



ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. సోమవారం ప్రకాశం భవనంలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 16 మంది బాల కార్మికులను గుర్తించామన్నారు. సంబంధిత యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకున్నామన్నారు. దీనిలో ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ పీడీ మాధురి, జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు కార్మిక కమిషనర్ అనితావాణి, ఇతర అధికారులు పవన్‌కుమార్, ఎలిజిబెత్తమ్మ, దినేష్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

నాలుగు రైళ్లు రద్దు

మార్కాపురం: గుంటూరు–గుంతకల్ మధ్యలో రైల్వే ట్రాక్ మరమ్మతులు, డబుల్ లైన్ ఏర్పాటు పనుల నిమిత్తం నాలుగు రైళ్లను రద్దు చేశారని మార్కాపురం స్టేషన్ మాస్టర్ జనార్ధన్ తెలిపారు. ఈ నెల 12 నుంచి 18 వరకు గుంటూరు–కాచిగూడ (నం.17251), ఈ నెల 14వ తేదీ నుంచి 20 వరకు కాచిగూడ–గుంటూరు (నం.17252) రైల్‌ను తాత్కాలికంగా రద్దు చేసినట్లు తెలిపారు. గుంటూరు– డోన్ (నం.17228) రైలును 12వ తేదీ నుంచి 20 వరకు, డోన్–గుంటూరు రైల్ (నం 17227)ను 13వ తేదీ నుంచి 19 వరకు రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రయాణికులు గమనించాలని కోరారు.



బడివైపు వడివడిగా..

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్య తరగతి విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్న వారికి ఏమాత్రం తీసిపోకుండా ఉండేలా పంపిణీ చేసిన జగనన్న విద్యాకానుక కిట్లతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మురిసిపోయారు. వేసవి సెలవుల తర్వాత సోమవారం ప్రభుత్వ పాఠశాలలు తెరుచుకున్నాయి. ఉదయం 7.30 గంటలకు బడి గంటలు మోగాయి. విద్యార్థులతో బడులన్నీ కళకళలాడాయి.



చీమకుర్తి రామ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లు అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

కానుకతో మురిసి బడికి జైకొట్టి..



చిన్నారిని బడికి తీసుకొస్తున్న తల్లి



తరగతి గదిలో పదో తరగతి విద్యార్థినులు



ఉదయం ప్రార్థన సమయంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు



తొలిరోజు బడిలో విద్యార్థినుల సందడి

ఒంగోలు: వేసవి సెలవుల తర్వాత జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో 2454 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో 2,18,341 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నందున ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నారు. ఉదయం ఏడు గంటలకే జిల్లాలోని అన్ని పాఠశాలలు తెరుచుకున్నాయి. 7.30 గంటలకు బడిగంట మోగే సమయానికి విద్యార్థులు స్కూళ్లకు చేరుకున్నారు. సెలవుల తర్వాత స్నేహితులంతా ఒక్కచోట కలుసుకోవడంతో అంతా సందడి వాతావరణం నెలకొంది. తల్లిదండ్రులతో కలసి వచ్చే చిన్నారులు..సైకిళ్లు, ఆటోల్లో, బస్సుల్లో వచ్చే విద్యార్థులతో స్కూళ్లన్నీ కళకళలాడాయి. తొలి రోజు 50 శాతం హాజరు నమోదైంది. విద్యార్థులు పాఠశాలలకు వస్తున్న సందర్భంగా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో శానిటైజేషన్‌తో సహా పలు చర్యలు తీసుకున్నామని డీఈవో రమేష్ తెలిపారు. విద్యార్థులకు మంచినీళ్లు అందుబాటులో ఉండేలా చూశామని చెప్పారు. అలాగే నూతన ప్రవేశాల కోసం వచ్చిన తల్లిదండ్రులతో కొన్ని పాఠశాలలు కిటకిటలాడాయి.

కిట్లు..పౌష్టికాహారం..

తొలిరోజు పాఠశాలకు చేరుకున్న విద్యార్థులకు 8 రకాల వస్తువులతో కూడిన జగనన్న విద్యా కానుక కిట్లు, రాగిజావను అందజేశారు. ఉదయం 7.30 గంటలకు పాఠశాల ప్రారంభమై 11.30 గంటలకు ముగిసింది. తొలుత విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కిట్లను అందజేశారు. అనంతరం విద్యార్థులకు రాగిజావను అందించారు.



విద్యార్థులకు ఇస్తున్న జగనన్న విద్యాకానుక కిట్

■ యర్రగొండపాలెం సచివాలయం–3 పరిధిలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను రాష్ట్ర పురపాలక శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, కలెక్టర్ దినేష్‌కుమార్ పంపిణీ చేశారు.

■ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ దర్శి మండలంలోని రాజంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో, చీమకుర్తి మండలంలోని దేవరపాలెం జిల్లాపరిషత్ హైస్కూలు, చీమకుర్తి రామ్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యాకానుక కిట్లను విద్యార్థులకు అందజేశారు.



మోగిన బడి గంట..

■ కనిగిరి పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రామధుసూదన్ యాదవ్, మార్కాపురం పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కిట్లను విద్యార్థులకు అందించారు.



స్కూల్ దగ్గర వదిలి వెళ్తున్న తండ్రికి బై బై చెబుతున్న విద్యార్థులు



ఒంగోలులో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థినులు



ఒంగోలు బండ్లమిట్ట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో అడ్మిషన్ల కోసం క్యూకట్టిన విద్యార్థినులు

ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు 'స్పందన'

● రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్, కలెక్టర్ దినేష్ కుమార్

యర్రగొండపాలెం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అత్యున్నత వేదిక ఒకటి ఉండాలని, ఆ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్న ఆలోచనతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రాం ఆడిటోరియంలో సోమవారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి ప్రత్యేక స్పందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి కలెక్టర్ దినేష్ కుమార్ అధ్యక్షత వహించారు. మంత్రి మాట్లాడుతూ స్పందన కార్యక్రమం ఎంతగా ప్రాచుర్యం పొందిందంటే సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయని ప్రజల్లో ఒక నమ్మకం ఏర్పడిందన్నారు. ప్రజలు వ్యయప్రయాసలకు ఓర్చి జిల్లా కేంద్రానికి వెళ్లి అర్జీ ఇచ్చేవారని, ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రతి నియోజకవర్గంలోకి వెళ్లి, జిల్లా యంత్రాగాన్ని తీసుకొచ్చి సమస్యలను పరిష్కరించాలన్న ఆలోచించిన కలెక్టర్‌ను ఆయన అభినందించారు. ఎంత పెద్ద అధికారి అయినా, ఎంతస్థాయి ప్రజా ప్రతినిధులైనా వారు ప్రభుత్వ వ్యతిరేకంగా కార్యక్రమాలు చేసిఉంటే వారిపై చర్యలు తప్పవని స్పందన కార్యక్రమం ద్వారా కలెక్టర్ ఒక సందేశం ఇచ్చారని అన్నారు. వెనకబడిన ప్రాంతమైన యర్రగొండపాలెం నియోజకవర్గంలో గిరిజనులు అధికంగా ఉంటారని, ప్రధానంగా రెవెన్యూకు సంబంధించిన అంశాలున్నాయని, భూ కబ్జాలు చేయడం, అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకోవడం వీటిపై ప్రత్యేకమైన దృష్టి పెట్టాలని కలెక్టర్‌ను కోరారు.

కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో జరిగే స్పందన కార్యక్రమానికి వచ్చి అర్జీలు ఇచ్చే పరిస్థితిలో లేని వారికి అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో మంత్రి సురేష్ సలహా మేరకు నియోజకవర్గ కేంద్రంలో ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. స్పందనలో వచ్చిన 316 అర్జీలు తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ శ్రీనివాసులు, సబ్ కలెక్టర్ సేథు మాధవన్, వెలిగొండ ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ కె.చెన్నయ్య, ఐసీడీఎస్ పీడీ కె.మాధురి, హౌసింగ్ పీడీ పేరయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మర్ధన్‌అలీ, డీపీవో జి.వి.నారాయణరెడ్డి, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి లక్ష్మానాయక్, తహసీల్దార్లు కె.రవీంద్రరెడ్డి, కె.దాస్, కిరణ్, కృష్ణారెడ్డి, వివిధ శాఖలకు చెందిన జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

స్పందన సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు



స్పందన కార్యక్రమంలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న డీఆర్‌ఓ శ్రీలత

● డీఆర్‌ఓ శ్రీలత

ఒంగోలు అర్బన్: స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం లేకుండా చిత్తశుద్ధితో వ్యవహరించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) శ్రీలత అధికారులకు సూచించారు. సోమవారం స్పందన భవనంలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించి దూర ప్రాంత ప్రజల సమస్యలను ఫోన్ ద్వారా తెలుసుకుని సంబంధిత అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. దీనిలో డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

■ గిద్దలూరు మండలం క్రిష్ణంపేట గ్రామానికి చెందిన దాసరి సాలమ్మ స్పందనలో అధికారులను కలిసి తన భర్త గుంటూరు జిల్లాలో డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తూ మరణించాడని తెలిపింది. తన భర్త ఉద్యోగం తనకు వచ్చిందని, ఒంటరి మహిళ కావడంతో ఇద్దరు ఆడపిల్లలు చదువుకునేందుకు కూడా దూర ప్రాంతం పోవాల్సి వస్తుందని చెప్పింది. తన పుట్టింటి వారికి దగ్గరలో ఉన్న అనుమలవీడు పీహెచ్‌సీకి బదిలీ చేయాలని కోరుతూ అర్జీ అందజేసింది.

■ కరవది గ్రామానికి చెందిన నాయని పావని స్పందనలో అధికారులను కలిసి తన భర్త ట్రాక్టర్ నడుపుతూ హైవేపై ప్రమాదం జరిగి మరణించాడని తెలిపింది. సదరు ట్రాక్టర్ యజమాని ట్రాక్టర్ ఇన్సూరెన్స్‌తో పాటు వైఎస్సార్ బీమా కింద డబ్బు వచ్చేలా చేస్తానని చెప్పి ఇప్పుడు మాట మార్చరని, అడిగితే దౌర్జన్యం చేస్తున్నారంటూ ఫిర్యాదు చేసింది. ఎటువంటి జీవనాధారం లేని ఒంటరి మహిళనని పరిశీలించి తమకు రావాల్సి ఇన్స్యూరెన్స్, బీమా డబ్బు ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేసింది.

■ ఒంగోలు నెహ్రూ కాలనీకి చెందిన మల్లేశ్వరరావు స్పందనలో తనకు ఆధార్ కార్డు ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశాడు. ఆధార్ కార్డులు ఇచ్చే సమయంలో తాను ఇంటి నుంచి వెళ్లిపోయానని, ఇప్పుడు తిరిగి వచ్చానని ఆధార్ కార్డు ఇప్పించాలని కోరుతూ అర్జీ అందచేశాడు.

నేడు కేజీబీవీ రిక్వెస్ట్ బదిలీలకు కౌన్సెలింగ్

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కేజీబీవీలలో పనిచేస్తూ రిక్వెస్ట్ రీప్లేస్‌మెంట్‌కు దరఖాస్తు చేసుకుని క్వాలిఫై అయిన సీఆర్‌టీ, పీఈటీ, నాన్‌టీచింగ్ స్టాఫ్‌కు రిక్వెస్ట్ బదిలీల కౌన్సెలింగ్ మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక సమగ్రశిక్ష కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు. బదిలీలకు సంబంధించి తుది సీనియార్టీ జాబితా ప్రకారం రిక్వెస్ట్ రీప్లేస్‌మెంట్‌కు అర్హులైన వారు తప్పక హాజరుకావాలన్నారు. తుది సీనియార్టీ జాబితా స్థానిక డీఈవో ప్రకాశం వెబ్‌సైట్‌లో ఉంచారని చెప్పారు.

మన విద్యా విధానం దేశానికే తలమానికం



జగనన్న విద్యా కానుక అందచేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్, కలెక్టర్ దినేష్‌కుమార్

● సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యం
● డ్రాపౌట్ల నివారణకే జగనన్న విద్యా కానుక
● జగనన్న విద్యా కానుక పంపిణీలో మంత్రి ఆదిమూలపు సురేష్, కలెక్టర్ దినేష్‌కుమార్

యర్రగొండపాలెం: రాష్ట్రంలో ప్రవేశపెట్టిన విద్యా విధానం దేశానికే తలమానికంగా మారిందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక సచివాలయం–3 పరిధిలో సోమవారం ఏర్పాటు చేసిన విద్యార్థులకు జగనన్న విద్యా కానుక పంపిణీలో మంత్రి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమానికి డీఈఓ పి.రమేష్ అధ్యక్షత వహించగా కలెక్టర్ దినేష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. మన రాష్ట్రంలో అమలవుతున్న విద్యావ్యవస్థ వైపు దేశం మొత్తం గమనిస్తుందన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు మొదటి విడతలో రూ.4 వేల కోట్లు ఖర్చు పెట్టామని, రెండో విడతలో తరగతి గదుల నిర్మాణం, డిజిటల్ తరగతులు నిర్వహించేందుకు మరో రూ..8 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. సీఎం జగన్ విద్యా, వైద్యం, వ్యవసాయంపైనే ఎక్కువగా దృష్టి సారించారన్నారు. ఇంగ్లిష్‌లో పట్టు సాధిస్తే అంతర్జాతీయస్థాయిలో రాణించవచ్చన్న ఉద్దేశంతో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారన్నారు. పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకునేందుకే బైజూస్‌ను తీసుకువచ్చి విద్యార్థులకు టెక్నాలజీని దగ్గర చేశామన్నారు. 8వ తరగతి నుంచి ట్యాబ్‌లు ఇస్తున్నారని, రానున్న రోజుల్లో తరగతి గదుల్లో ఇంటరాక్టివ్‌ప్యానల్ బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

జగనన్న విద్యా కానుక వరం

కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ జగనన్న విద్యాకానుక అన్ని వర్గాలకు చెందిన విద్యార్థులకు వరం లాంటిదని, దీని వల్ల డ్రాపౌట్లను నివారించవచ్చన్నారు. ఆర్థిక స్తోమతలేని వారు సైతం ఇప్పుడు తమ పిల్లలను పాఠశాలలకు పంపుతున్నారని, మంచి నోట్‌బుక్స్, టెస్ట్‌బుక్స్, నాణ్యమైన యూనిఫాం, బూట్లు, సాక్సులు తమ పిల్లలకు అందుతున్నాయన్న ఆనందంతో తల్లిదండ్రులు ఉన్నారన్నారు. పిల్లల చదువులతో పాటు పాఠశాలల్లో అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. విద్యార్థుల్లో క్రమశిక్షణను అలవర్చాలన్న ఉద్దేశంతో తప్పనిసరిగా యూనిఫాం వేసుకొని బడికి రావాలని ఆంక్షలు పెట్టామన్నారు. అనంతరం మంత్రి, కలెక్టర్ విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఎంపీపీలు దొంతా కిరణ్‌గౌడ్, కోట్ల సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పీడీసీసీబీ డైరెక్టర్ బాలగురవయ్య, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబుల్‌రెడ్డి, పి.కృష్ణారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, శ్రీశైలం దేవస్థానం మాజీ డైరెక్టర్ ఐవీ సుబ్బారావు, డిప్యూటీ డీఈఓ చంద్రమౌళేశ్వరరావు, సీఎంఓ సుబ్బారావు, ఎంఈఓలు పాల్గొన్నారు.

హరోం హర

● శివ నామస్మరణతో మార్మోగిన పెదయిర్లపాడు
● వైభవంగా 1111 శివలింగాల ప్రతిష్ట



ప్రధాన సహస్ర శివలింగాన్ని ప్రతిష్ఠిస్తున్న విద్యారణ్య భారతి స్వామి



కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్న స్వామీజీ

పీసీపల్లి: హరోం హర..శంభో శంకర అంటూ శివనామస్మరణతో పెద ఇర్లపాడు మల్లేశ్వరాలయం మార్మోగింది. ఆలయంలో నాలుగు రోజులుగా వేదపండితుల మంత్రోచ్ఛరణలతో 1111 శివలింగాలు, సహస్ర ప్రధాన లింగం పూజలందుకున్నాయి. సోమవారం హంపీ విరూపాక్ష పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి వారి నేతృత్వంలో మహా ప్రధాన సహస్ర శివలింగ ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం 1111 శివలింగాల ప్రతిష్ఠించారు. విద్యారణ్య భారతి ప్రధాన సహస్ర లింగానికి అభిషేకం చేసి అనంతరం గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరుడు, నక్షత్ర, ఆదిశంకరులు, శిఖర, బింబ విగ్రహాల ప్రతిష్ఠ, పూర్ణాహుతి, కుంబాభిషేకం, శాంతి కళ్యాణం, విశేష గ్రామోత్సవం నిర్వహించారు. హోమాల్లో ప్రముఖ డైరెక్టర్ నంది నర్సింహ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని వీక్షించేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా విద్యారణ్య భారతి స్వామి మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో ఇంతటి అమోఘమైన పుణ్య కార్యక్రమానికి పూనుకున్న పలుకూరి సుబ్బారావు, దాతలు ధన్యులన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మీకాంతం ఓకేరెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ పోలు జయరామిరెడ్డి, వరలక్ష్మీ, ప్రముఖ డైరెక్టర్ నంది నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

లారీని ఢీకొన్న కారు, ముగ్గురికి తీవ్రగాయాలు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

మేదరమెట్ల: జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల జాతీయ రహదారి కొండ సమీపంలో సోమవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. పేర్నమిట్ట గ్రామానికి చెందిన రమేష్ రెడ్డి, మల్లీశ్వరి, జోషి ముగ్గురు కారులో పని నిమిత్తం వేరే ఊరు వెళ్లి తిరిగి స్వగ్రామానికి ఉన్నున్నారు. కారు మేదరమెట్ల జాతీయ రహదారి కొండ సమీపానికి రాగానే చెన్నైకు వెళ్లేందుకు రోడ్డు పక్కన నిలిపి ఉన్న మామిడి కాయల లోడు లారీని బలంగా వెనుకనుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులు ఒంగోలు కిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగశివారెడ్డి తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో కారులో బెలూన్‌లు ఓపెన్ కావడంతో ప్రాణాపాయం తప్పింది.

పొగాకు కేజీ రూ.241

కందుకూరు: పొగాకు వేలంలో ధరల జోరు కొనసాగుతూనే ఉంది. రైతులు ఊహించని విధంగా ఈసారి రేట్లు భారీగా పెరుగుతున్నాయి. సోమవారం జరిగిన వేలంలోనే కేజీ పొగాకు అత్యధిక ధర రూ.241 పలికింది. కందుకూరు-1వ వేలం కేంద్రంలో 783 బేళ్లను విక్రయానికి ఉంచగా 693 బేళ్లు, కందుకూరు-2లో 924 బేళ్లకు గాను 833 బేళ్లు విక్రయించారు. రెండు వేలం కేంద్రాల్లోను అత్యధిక ధర రూ.241 రాగా, కనిష్ట ధర రూ.160 వచ్చింది. వరుసగా ధరలు పెరుగుతుండడంతో సరాసరి ధర రూ.229 నమోదు కావడం గమనార్హం.

నేషనల్ జూడో పోటీలకు జట్టు ఎంపిక నేడు

అద్దంకి రూరల్: తిరుపతిలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్న నేషనల్ క్యాడెట్ జూడో చాంపియన్‌షిప్-2023, జూలై 5 నుంచి 10వ తేదీ వరకు కర్ణాటకలోని తోరణగల్లు ఇన్‌స్పైర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌లో నిర్వహించనున్న నేషనల్ క్యాడెట్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనడానికి బాపట్ల జిల్లా జూడో బాలబాలికల జట్లను ఈ నెల 13వ తేదీ ఎంపిక చేయనున్నట్లు జిల్లా జూడో సంఘ కార్యదర్శి పీ రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 9 గంటలకు అద్దంకిలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు 73965 12022 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

గుడ్లూరు: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని తెట్టు-రావూరు మధ్య ఆదివారం రాత్రి జరగగా సోమవారం రైల్వేపోలీసులు గుర్తించారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పూరేటిపల్లి గ్రామానికి చెందిన ఒంగోలు మల్‌తేజ(21) ఆదివారం రాత్రి తెట్టు -రావూరు మధ్య రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం సిబ్బంది గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే పోలీసులు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రైల్వే వైద్యశాలకు తరలించారు. తండ్రి మాల్యాద్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆత్మహత్య కారణాలు తెలియరాలేదు. చేతికంది వచ్చిన కుమారుడి మృతితో తల్లిదండ్రులు బోరున విలపించారు.

మార్టూరులో దుకాణాల తనిఖీ

మార్టూరు: వాణిజ్య పన్నుల శాఖల అధికారులు పలు దుకాణాలను తనిఖీ చేశారు. మండల కేంద్రం మార్టూరులోని నాలుగు దుకాణాలను వాణిజ్య పన్నులశాఖ జాయింట్ కమిషనర్ డీ నాగజ్యోతి తమ సిబ్బందితో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ఇటీవల అడ్రస్ మార్పు కోసం, నూతనంగా లైసెన్స్‌లు పొందిన స్థానిక భాను ట్రేడర్స్, రజాక్ ట్రేడర్స్, లక్ష్మి ఆటోమొబైల్స్, వరలక్ష్మీ వినాయక ట్రేడర్స్ షాపులను ఆమె పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో వాణిజ్య పనులు శాఖ సిబ్బంది, దుకాణ యజమానులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన

- పిల్లలు పోటీపడి చదవాలి
- గత ప్రభుత్వంలో పాఠశాలలను గాలికొదిలిన చంద్రబాబు
- జగనన్న విద్యాకానుక పంపిణీలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ


విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

దర్శి: కార్పొరేట్ పాఠశాలలో పోటీ పడేలా ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సూచించారు. మండలంలోని రాజంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను సోమవారం జెడ్పీ చైర్‌పర్సన్ విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చంద్రబాబు విద్యార్థుల భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టారని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యమిస్తూ విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటు వేస్తున్నారన్నారు. నాడు-నేడు పేరుతో పాఠశాలల ఆధునీకీకరణకు వేల కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. పాఠశాల తెరిచిన రోజే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారన్నారు. జగనన్న గోరుముద్ద ద్వారా విద్యార్థులకు పుష్టికరమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు విద్యార్థులను చదివించే స్థోమత లేక ఇబ్బందులు పడకుండా అమ్మవడి, విద్యాదీవెన, వసతి దీవెన పథకం ద్వారా లబ్ధి చేకూరుస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు జన్మభూమి కమిటీలు పెట్టి ప్రభుత్వ పథకాలన్నీ వారే దోచుకు తిన్నారని, ప్రస్తుతం పార్టీలకతీతంగా అర్హులందరికీ లబ్ధి చేకూర్చేలా దేశంలోనే ఆదర్శవంతమైన సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. పాఠశాలలో గ్రౌండ్‌లెవల్, సైడు కాలువలు మంజూరు చేయాలని ఉపాధ్యాయులు కోరగా..వెంటనే ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. పాఠశాలలో లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరగా..వెంటనే రూరల్ ఏఈతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. అనంతరం విద్యార్థులకు వండిన భోజనాన్ని పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు గోళ్లపాటి చంద్రమోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ఎం బాషా, ఎంపీపీ సుధారాణి, ఎంపీడీఓ కుసుమకుమారి, ఎంఈఓ కాకర్ల రఘురామయ్య ,స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఆర్ చిన్న అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

175 అసెంబ్లీల్లో వైఎస్సార్ సీపీదే విజయం

- పార్టీ నాయకునిపై దాడి అమానుషం
- జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి


మాట్లాడుతున్న జంకె వెంకటరెడ్డి

మార్కాపురం టౌన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 175 స్థానాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులదే విజయమని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి సీఎం కావడం ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి అన్నారు. మార్కాపురంలోని తన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఇటీవల వైఎస్సార్ సీపీ వైద్య విభాగం అధ్యక్షుడు, సింగరాయకొండకు చెందిన డాక్టర్ బత్తుల అశోక్‌రెడ్డిపై జరిగిన దాడిని జంకె ఖండించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు మనస్పర్థలు వీడి పార్టీని మరింత బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో విజయానికి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేసేందుకు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమస్యలేమైనా ఉంటే సమన్వయంతో పరిష్కరించుకోవాలని సూచించారు.

త్వరలో పార్టీ అనుబంధ కమిటీల నియామకం...

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో త్వరలో పార్టీ అనుబంధ కమిటీలను నియమించి బలోపేతం చేయనున్నట్లు జంకె వెంకటరెడ్డి తెలిపారు. పార్టీ అనుబంధ కమిటీల అధ్యక్షునిగా ఎంపీ విజయసాయిరెడ్డి నియమితులయ్యారని, ఆయనకు అభినందనలు తెలుపుతున్నామని అన్నారు. త్వరలో గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి కమిటీలను నియమించి అందరితో చర్చించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి అనుబంధ కమిటీల అధ్యక్షులతో త్వరలో సమావేశం నిర్వహిస్తామన్నారు. రానున్న 9 నెలల సమయం చాలా కీలకమన్నారు. పార్టీ పదవులు పొందిన ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని జంకె కోరారు.

ప్రజలకు చేరువగా రెవెన్యూ సేవలు

- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్


సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ శ్రీనివాసులు, సబ్ కలెక్టర్

మార్కాపురం: ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత దగ్గర కానున్నాయని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. మార్కాపురం పట్టణంలో సుమారు రూ.25 లక్షల వ్యయంతో ఆధునీకీకరించిన సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సోమవారం జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులతో కలిసి కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సుమారు 90 సంవత్సరాల క్రితం మార్కాపురంలో బ్రిటీష్ ప్రభుత్వం వారు రెవెన్యూ డివిజినల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. చారిత్రక కట్టడంగా దాన్ని గుర్తించి ఎటువంటి డ్యామేజీ జరగకుండా అన్ని హంగులతో సబ్ కలెక్టర్ కార్యాలయంగా మార్చినట్లు చెప్పారు. ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమానికి ఇబ్బంది లేకుండా తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం కూడా కల్పించామన్నారు. కార్యాలయ ప్రాంగణంలోనే పట్టణ ఆరోగ్యశాఖ వైద్యశాల ఉందని, వారిని దృష్టిలో పెట్టుకుని కూడా పునర్నిర్మాణంలో వసతులు కల్పించామని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ శాఖ ప్రజలకు మరిన్ని సేవలందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శిలా ఫలకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సేథు మాధవన్, తహసీల్దార్లు కిరణ్‌కుమార్, రమాదేవి, ఖలీల్, డివిజన్ సర్వేయర్లు శివశంకర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టపగలే దోచేశారు..!


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి


వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం


సీసీ కెమెరాకు చిక్కిన చోరీకి పాల్పడిన ముగ్గురు యువకులు

- 36 సవర్ల బంగారు ఆభరణాలు, అరకేజీ వెండి చోరీ
- చోరీకి పాల్పడ్డ ముగ్గురు యువకులు
- బాధితులు ఉపాధ్యాయ దంపతులు
- ఉలిక్కిపడ్డ మూలగుంటపాడు

సింగరాయకొండ: మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ విద్యానగర్‌లో పట్టపగలే భారీ చోరీ జరిగింది. ఇటీవల విద్యానగర్‌లో జరిగిన ఘటన మరవకముందే సోమవారం భారీగా బంగారు ఆభరణాలు, వెండిని అపహరించారు. పట్టపగలే చోరీ జరగడంతో విద్యానగర్ వాసులు ఉలిక్కిపడ్డారు. ఈ ఘటనలో సుమారు రూ.17 లక్షల విలువైన 36 సవర్ల బంగారు ఆభరణాలు, అరకేజీ వెండి చోరీకి గురైంది. బాధితుల కథనం ప్రకారం..ముమ్మడిశెట్టి చంద్రశేఖర్, అతని భార్య రమాదేవి ఇద్దరు ఉపాధ్యాయులు. చంద్రశేఖర్ పొన్నలూరు మండలం కొత్త శింగరబొట్లపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా, రమాదేవి గుడ్లూరు మండలం కర్లపాలెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. వీరిద్దరూ సోమవారం ఉదయం 7 గంటలకు ఇంటికి తాళం వేసి ఉద్యోగ నిమిత్తం వెళ్లి తిరిగి స్కూలు వదిలిపెట్టగానే ముందుగా రమాదేవి మధ్యాహ్నం సుమారు 12.51 గంటల సమయంలో ఇంటికి చేరింది. ఈ మధ్య సమయంలో 16 నుంచి 18 ఏళ్ల వయసున్న యువకులు ఇనుప రాడ్‌తో ఇంటి ఆవరణలోకి గోడ దూకి ప్రవేశించారు. తరువాత తాళాన్ని ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించి బీరువాలోని బంగారు వస్తువులు రెండు పూలహారాలు, మూడు నెక్లెస్‌లు, ఒక కడియం, మూడు పెద్ద ఉంగరాలు, ఐదు చిన్న ఉంగరాలు, ఒక చైన్, రెండు గాజులు, ఒక బ్రాస్‌లెట్, రెండు నల్లపూసల దండలు, సుమారు అర కేజీ బరువు ఉన్న వెండి వస్తువులు చోరీ చేశారు. రమాదేవి ఇంటికి వచ్చిన సమయంలో చోరీకి పాల్పడ్డ ముగ్గురిలో ఒక యువకుడు సమీపంలోని కరెంటు స్తంభం వద్ద రిపేరు చేస్తున్నట్లు నటిస్తున్నాడు. గత రెండు రోజులుగా ఆ ప్రాంతంలో విద్యుత్ సక్రమంగా లేదని మరమ్మతులు చేయడానికి వచ్చారేమోనని భావించానని, తరువాత కొద్దిసేపటికి ఒక యువకుడు నంబర్ ప్లేటు లేని మోటారుసైకిల్ వేసుకుని రావటంతో కరెంటు రిపేరు చేస్తున్నట్లు నటిస్తున్న యువకుడు మోటారుసైకిల్ ఎక్కి వెళ్లాడని రమాదేవి పోలీసులకు వివరించారు. పోలీసులు సమీపంలోని సీసీ కెమెరాలు పరిశీలించగా తాను చూసిన ముగ్గురు వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు నిర్ధారణ అయిందని, చోరీ చేసి కళ్ల ముందే వారంతా దొరబాబుల్లా వెళ్లిపోయారని వాపోయింది. సంఘటనా స్థలాన్ని ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, సీఐ దాచేపల్లి రంగనాథ్, ఒంగోలు తాలూకా సీఐ రాంబాబు పరిశీలించారు. తరువాత క్లూస్‌టీం బృందం వచ్చి వేలుముద్రలు సేకరించారు. చోరీకి పాల్పడిన యువకులను పట్టిచ్చిన వారికి తగిన పారితోషికం ఇస్తామని పోలీసులు ప్రకటించారు. ఇందుకు డీఎస్పీ 9121102120, సీఐ 9121102135, ఎస్సై 9121102136 నంబర్లకు సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు. ఏఎస్సై షేక్ మహబూబ్‌భాషా, హెడ్ కానిస్టేబుల్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి దుర్మరణం


బాలయ్య మృతదేహం

మార్కాపురం: కదులుతున్న రైలు ఎక్కే క్రమంలో ప్లాట్‌ఫాం, రైలుకు మధ్య జారి పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి మార్కాపురం రైల్వే స్టేషన్‌లో జరిగింది. వివరాల్లోకి వెళితే..విజయవాడ, హుబ్లీ రైలు మార్కాపురం రైల్వే స్టేషన్‌లో ఆదివారం అర్ధరాత్రి ఆగింది. అర్ధవీడు మండలం బోగోలు గ్రామానికి చెందిన దుద్దు బాలయ్య (42) పెయింటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. విజయవాడ వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు రాగా కదులుతున్న రైలు ఎక్కే క్రమంలో కాలు జారి ప్లాట్‌ఫామ్‌కు రైలుకు మధ్య ఇరుక్కుపోయాడు. శరీరంపై నుంచి రైలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఎస్సై కొట్టాడని ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి


మృతదేహాన్ని చూసేందుకు గురవారెడ్డి ఇంటి వద్దకు చేరిన బంధువర్గం


మృతిచెందిన గురవారెడ్డి (ఫైల్)

- వీఆర్‌కు త్రిపురాంతకం ఎస్సై జీవీ సైదులు
- దొనకొండ ఎస్సై సైదాబాబుకు చార్జ్ అప్పగింత

త్రిపురాంతకం: స్థానిక ఎస్సై చేయిచేసుకున్నాడని మనస్తాపానికి గురై పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన చల్లా గురవారెడ్డి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. దాంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. త్రిపురాంతకంలో పాత గొడవల కారణంగా రెండు వర్గాల వారు పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడంతో ఈ నెల 11వ తేదీ స్థానిక ఎస్సై జీవీ సైదులు వారిని పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఆ సమయంలో ఒక వర్గానికి చెందిన గురవారెడ్డిపై ఎస్సై చేయిచేసుకోవడంతో అతను మనస్తాపంతో పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. దీనిపై ఆగ్రహించిన అతని బంధువులు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్ చర్చించి ఆందోళనను విరమింపజేశారు. ఈ నేపథ్యంలో వినుకొండ వైద్యశాలలో చికిత్స పొందుతున్న గురవారెడ్డి సోమవారం మృతి చెందాడు. దీనిపై ఎస్పీ మలికాగర్గ్ ఆదేశాల మేరకు ఎస్సై జీవీ సైదులును వీఆర్‌కు పంపినట్లు సీఐ పాపారావు తెలిపారు. ప్రస్తుతం దొనకొండ ఎస్సై సైదాబాబు ఇన్‌చార్జి ఎస్సైగా వ్యవహరిస్తున్నారన్నారు. మృతుడు గురవారెడ్డి బావ కోటిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేస్తామని సీఐ పేర్కొన్నారు.

పోలీస్ స్పందనకు 77 ఫిర్యాదులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందనకు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల నుంచి 77 ఫిర్యాదులు అందాయి. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ మలికాగర్గ్.. ఫిర్యాదుల గురించి సమగ్రంగా అడిగి తెలుసుకున్నారు. చట్టపరిధిలో వాటిని పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఫిర్యాదులపై స్పందించిన ఎస్పీ అప్పటికప్పుడు సంబంధిత పోలీసుస్టేషన్ అధికారులతో మాట్లాడారు. స్పందన ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధచూపాలని ఆదేశించారు.

- వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లో మొబైల్ క్యాంటీన్ కాంట్రాక్ట్ ఇప్పిస్తానని చెప్పి సాయికుమార్ అనే వ్యక్తి తన వద్ద రూ. 1.30 లక్షలు చేశాడని, అయితే కాంట్రాక్ట్ ఇప్పించకపోగా తన డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాడని ఒంగోలుకు చెందిన ఉదయ్ శంకర్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు.
- ఒంగోలు దిబ్బలరోడ్డుకు చెందిన వేణు అనే వ్యక్తి వద్ద బంగారం తాకట్టు పెట్టి రూ.1.60 లక్షలు తీసుకున్నానని, అసలు, వడ్డీతో కలిపి డబ్బులు మొత్తం చెల్లించినా బంగారు ఇవ్వకుండా బెదిరిస్తున్నాడని ఎం.సుబ్బారావు ఫిర్యాదు చేశారు. స్పందనలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్పీ వి.నారాయణస్వామి రెడ్డి, డీఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, ఐసీసీఆర్ సీఐ దుర్గాప్రసాద్, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషాలు రెచ్చగొడితే సహించేది లేదు

- ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: మతసామరస్యాన్ని దెబ్బతీసే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మలికాగర్గ్ హెచ్చరించారు. యర్రగొండపాలెం పోలీసుస్టేషన్ పరిధిలో మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ముస్లిం, క్రిస్టియన్ వర్గాల ప్రజలను దూషిస్తూ పోస్టులు పెట్టిన పి.లింగయ్యపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో కామెంట్లు, పోస్టులు పెట్టే వారు సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. కులమతాలు, ప్రాంతాలు, భాషల మధ్య చిచ్చుపెట్టేలా వ్యాఖ్యలు చేయడం, ఇతరులను కించపరచడం లాంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మనమంతా భారతీయులమని, అన్ని మతాలు ఒక్కటేనని, భారతీయత అంటే సామరస్యంగా కలిసిమెలిసి జీవించడమని ఎస్పీ పేర్కొన్నారు. సమాజ శ్రేయస్సు అందరి అభిమతం కావాలని హితవు పలికారు. మత విద్వేషాలకు రెచ్చగొట్టే వారి సమాచారం ఉంటే స్థానిక పోలీసుస్టేషన్లో అధికారులకుగానీ, పోలీసు కంట్రోలు రూం వాట్సాప్ నంబర్ 9121102266, డయల్ 112కు తెలియజేయాలని ఎస్పీ కోరారు.

వడదెబ్బకు ఒకరు మృతి

కనిగిరి రూరల్: వడదెబ్బ తగిలి ఒకరు మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని ఇందిరాకాలనీకి చెందిన పానుగంటి కోటేశ్వరరావు (35) ఒంగోలు ఆస్పత్రిలో చూయించుకుని తిరిగి వచ్చి కనిగిరిలో బస్సు దిగాడు. కొద్దిసేపటికే స్థానిక చర్చి సెంటర్‌లో సొమ్మసిల్లి పడిపోయాడు. స్థానికులు, బంధువులు కోటేశ్వరరావును ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే కోటేశ్వరరావు మృతి చెందినట్లు తెలిపారు. వడదెబ్బ తగిలి మృతి చెందినట్లు భావిస్తున్నారు.

చెస్ విజేతలు వీరే


రాష్ట్రస్థాయి చెస్‌పోటీలకు ఎంపికైన చిన్నారులు

ఒంగోలు: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో సోమవారం జిల్లాస్థాయి అండర్ 7, అండర్ 9 చెస్ పోటీలు నిర్వహించారు. అండర్-7 ఓపెన్ విభాగంలో మొదటి రెండు స్థానాలను హైదర్ ఆలీ, బ్రహ్మభాను సిద్ధార్థరెడ్డి, బాలికల విభాగంలో శ్రీసుదీక్ష, తేజస్వినిలు విజేతలుగా నిలిచారు. అండర్- 9 ఓపెన్ విభాగంలో అఖిలేష్, జ్ఞానశ్రీకృష్ణ దేవన్ష్ మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. బాలికల విభాగంలో లాస్యశ్రీప్రియ, అర్జిత స్కందనలు నిలిచారు. వీరు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా చెస్ కార్యదర్శి షేక్ అబ్దుల్ నబీ తెలిపారు. ముఖ్య అతిథిగా జవహర్ నవోదయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.సుబ్రహ్మణ్యేశ్వరరావు విద్యార్థులకు బహుమతులు అందించారు.


వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని నివాసంలో తల్లిదండ్రులైన ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి సమక్షంలో కేక్ కట్ చేశారు. వేడుకల్లో పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ప్రణీత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.